క్లుప్తంగా

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి

పాచిపెంట: స్థానిక పీహెచ్‌సీని డిప్యూటీ డీఎం హెచ్‌ఓ పద్మావతి శనివారం సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ఓపీ, రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఆమె వెంట వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రేపు

బలిజిపేట: మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఎగ్జిబిషన్) బలిజిపేట ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించనున్నట్టు ఎంఈఓ 1 సామల సింహాచలం శనివారం తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌లో ఉన్నత పాఠశాలలు, యూపీ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టును జనవరి 3న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా అర్చకులు రాంబాబు భక్తులు ఇచ్చిన పూలతో అలంకరించి స్వామివారికి పూజలు జరిపారు. గోదాదేవికి తిరుప్పావై ప్రవచనాలతో పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మార్చిలోగా ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పూర్తి



గర్భిణుల బర్త్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: వచ్చే ఏడాది మార్చిలోగా వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శనివారం ఆమె సందర్శించారు. వంద పడకల ఆస్పత్రి పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఆస్పత్రి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. సుమారు రూ.10.80 లక్షలతో నిర్మించిన గర్భిణుల బర్త్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించారు. పలువురు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి పార్వతి.

సీతానగరం: మద్యం అక్రమంగా విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ డి.పార్వతి అన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న లఖనాపురంలో సారా, మద్యం విక్రయాల నివారణకు సంబంధించి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతానగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. సారా విక్రయాలు, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న సమాచారం వస్తే సోదాలు చేపడతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు

- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- వాహన చోదకుల తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి...



గలావల్లి మార్గంలో అధ్వానంగా రహదారి

బలిజిపేట:

వంతరాం నుంచి గలావల్లి వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. అడుగుకో గుంత.. గజానికో గొయ్యిలా మారి ప్రమాదాలకు కేరాఫ్ చిరునామాకు మారింది. ఈ రహదారిపై ప్రయాణమంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ మార్గంలో ఏ వాహనంపై వెళ్లాలన్నా భయపడేలా రహదారి తయారైంది. రాత్రి పూట మరింత ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు తమ బైక్‌లపై వెళ్లేటప్పుడు ఏ ప్రమాదం ఎక్కడ జరుగుతుందోనని భయాందోళనల నడుమ ప్రయాణం సాగిస్తున్నారు. ఇతర వాహనాలపై వెళ్లే వారు ఈ మార్గంలో ప్రయాణం పూర్తయ్యే సరికి ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ రహదారి, పలగర వెళ్లే రహదారులు ప్రమాదాలకు హేతువుల్లా ఉన్నా ఎవరికీ పట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. చివరకు నడక మార్గం కూడా ఇబ్బందికరంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే రోడ్డుపై గుంతల్లో నీరు చేరి కనబడకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. కూటమి అధికారంలో వస్తే



గంగాడ మార్గంలో రాళ్లు తేలి గుంతలుగా ఉన్న రహదారి

గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తామని చెప్పారని, తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా... నేటికీ అదే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు దుయ్యబడుతున్నారు. ప్రజల ప్రాణాలంటే పాలకులకు పట్టడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఈ మార్గాల్లో శాశ్వత మరమ్మతుల మాటెలా ఉన్నా కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వాహన చోదకులకు నిత్య నరకం

వంతరాం – గలావల్లి రహదారితో పాటు మండల కేంద్రమైన బలిజిపేట, పలగర రహదారులు గోతులతో నిండిపోయాయి. వాహన చోదకులు ఈ మార్గంలో నిత్య నరకం అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలపై ఈ మార్గంలో ప్రయాణమంటే భయపడిపోతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకునేందుకు సైతం వీల్లేని విధంగా గోతులు ఏర్పడ్డాయి. మలుపుల వద్ద గోతుల వద్ద వాహనాలు ఓ వైపు ఒరిగిపోయి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు.

మరమ్మతులు చేయండి

మండలంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు తక్షణమే చేయాలి. ప్రజలకు అవసరమైన రహదారుల సదుపాయాన్ని కల్పించలేకపోతే మరెందుకు. మండల కేంద్రంలోనే అధ్వానంగా ఉంటే గ్రామీణ ప్రాంతాల రహదారుల పరిస్థితి ఏంటి. అధికారులు, పాలకులు తక్షణమే రహదారుల బాగుకు చర్యలు చేపట్టాలి.

– అప్పలస్వామి, బలిజిపేట



నీటితో నిండి ప్రమాదకరంగా ఉన్న గొయ్యి



బలిజిపేట బస్టాండులో ఇలా...

జయలక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి

పార్వతీపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్‌పీగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై మరణించిన మరడాన జయలక్ష్మి(29) కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, ట్రెజరర్ గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం మున్సిపాలిటీ 22వ వార్డు సారిక వీధికి చెందిన ఆర్‌పీ జయలక్ష్మి అనారోగ్యానికి గురై బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు ఆమె కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందించే జయలక్ష్మి మరణం బాధాకరమని పేర్కొన్నారు. ఆమె కుటుంబం పేదరికంలో ఉందని ఆ కుటుంబానికి ఆసరాగా ఉన్న జయలక్ష్మి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రభుత్వ పథకాలు, సంస్థలలో పని చేస్తున్న వివిధ రకాల కార్మికులకు, ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మరణించిన ఆర్‌పీ జయలక్ష్మి కుటుంబానికి మెప్మా అధికారులు తక్షణమే ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కార్గో డోర్ డెలివరీని మరింత విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం కనకదుర్గ

- డీఎం కనకదుర్గ

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ సంస్థ ద్వారా తమ బస్సులలో తీసుకొచ్చిన కార్గో వ్యవస్థ ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకుందని, ఇందులో భాగంగానే కార్గో డోర్ డెలివరీని మరింత అభివృద్ధి పరచాలని డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు. డిపో ఆవరణలో డెలివరీ ప్రచార మాసోత్సవాలలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్గో వ్యవస్థ వ్యాపారస్తులు, ప్రజల నుంచి మంచి గుర్తింపు పొందిందన్నారు. కార్గో ద్వారా ఒక కేజీ బరువు నుంచి 50 కేజీల వరకు (జీఎస్టీ అదనం) డోర్ డెలివరీని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులందరూ కూడా ఒక్కొక్కరు మూడు డెలివరీని కార్గో ద్వారా చేయించి కార్గో అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఆర్టీసీ సంస్థకు పరోక్షంగా కార్గో వ్యవస్థ ఎంతో సహకరిస్తుందని తెలిపారు. ఈ డోర్ డెలివరీ వ్యవస్థను మనతో పాటు మన కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు, భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. 50 కేజీల బరువు వరకు పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సదుపాయం ఉందన్నారు. ఆర్టీసీ సంస్థలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లతోపాటు కార్యాలయ సిబ్బంది తాము బస్సు ఎక్కి సర్వీస్ చేసేటప్పుడు దిగిపోయే ప్రయాణికులకు డోర్ డెలివరీ సౌకర్యం గురించి తెలిపి వారిని ప్రోత్సహించాలని సూచించారు. పార్వతీపురం డిపోకు ఇచ్చిన లక్ష్యాన్ని అందరి సహకారంతో అధిగమించి ఆర్టీసీ సంస్థను అభివృద్ధి బాటలో నడపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



శిక్షణ పొందిన 108 సిబ్బంది

పార్వతీపురం టౌన్: అత్యవసర సేవల సిబ్బంది మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా మేనేజర్ ఎస్.మన్మధనాయుడు అన్నారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్స్‌లో పని చేసే మెడికల్ టెక్నీషియన్లకు రిఫ్రెషర్ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హృద్రోగులు, మాతా శిశు రక్షణ సేవలపై తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ గ్రామంలో రోగులను గుర్తించి వారికి గ్రామాల్లోనే సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఓజీటీ అలుబిల్లి శ్రీనివాసరావు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవ పూజలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి గోవింద మాలలు ధరించిన భక్తులు సమకూర్చుకున్న పూజాద్రవ్యాలతో వేణుగోపాలస్వామి సమేత గోదాదేవి అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిగాయి. అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను అలంకరించి పూలతో ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకీలో తిరువీధి చేసారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ చేసారు.

వేగవంతంగా గోశాలల నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని ఉపాధి హామీ పథకం నిధులతో పాడి రైతులు నిర్మిస్తున్న గోశాలల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. జానుమల్లువలసలో నిర్మిస్తున్న గోశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటిపేటలో నిర్మాణం చేసిన గోశాల పనుల్లో నాణ్యతను పరిశీలించి పలు సూచనలు ఇచ్చామన్నారు. పాడి పశువులున్న రైతులకు గోశాలలు వేసవి, వర్షాకాలంలో ఉపయోగ పడతాయని అన్నారు. ఇప్పటికి బుడ్డిపేట గ్రామంలో రెండు గోశాలల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వేను సిబ్బంది వేగవంతం చేయాలని సూచించామని అన్నారు. కార్యక్రమంలో అంటిపేట, జానుమల్లువలస ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు సత్యవతి, నాయుడు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

సీతానగరం: మండలంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని పీఆర్ మండల ఏఈ జి.చంద్రమౌళి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.252.01 లక్షలతో 67 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కాశీపేట, పెదబొగిలి, రామవరం, ఆర్.వెంకంపేట గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికీ పనులు ప్రారంభించని నిర్వాహకులు పనులు చేపట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి బిల్లులు అందిపుచ్చుకోవాలని సూచించారు. పెదబొగిలి పంచాయతీలో మూడువీధుల్లో సీసీ రోడ్లు కాలువలు నిర్మాణం జరిగిందన్నారు. 2025 జనవరి 15లోగా పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

రేపు సాలూరులో పీజీఆర్ఎస్

- హాజరు కానున్న కలెక్టర్, జిల్లా అధికారులు

సాలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ అర్జీలను సమర్పించాలని అన్నారు. జిల్లా అధికారులందరు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. పీజీఆర్ఎస్ అనంతరం శంబర జాతర ఏర్పాట్లుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

14 గ్రామాల్లో పెసా ఎన్నికలు

సీతంపేట: మండలంలోని 14 గ్రామాల్లో పెసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏజెన్సీస్) ఎన్నికలు శనివారం నిర్వహించారు. మొత్తం 15 గ్రామసభలు నిర్వహించి ఉపాధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. సోమవారం మరో 17 గ్రామాల్లో పెసా సభలు నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

బాలికా విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



కిశోర బాలికల విద్య, ఆరోగ్యం, మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి పని చేయాల్సిన అవసరం ఉందని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్వీ రమణ అన్నారు. బలిజిపేట ఐసీడీఎస్ పీఓ సురేఖ ఆధ్వర్యంలో వెలుగు వీఓఏలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, ఐసీడీఎస్ సిబ్బందికి శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమకూర్చుతున్న పౌష్టికాహారం మహిళలు విధిగా తీసుకోవాలని సీడీపీఓ కోరారు. ఎంఈఓలు సూరిదేముడు, ఎం.వెంకటరమణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. – సీతానగరం

5న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు



యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు జనవరి 5న కాకినాడలో ప్రారంభం కానున్నట్టు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సీతానగరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.ఆదినారాయణ, సభ్యులు పల్లి శ్రీనివాసరావు, మండల శాఖ గౌరవాధ్యక్షుడు టి.మధుసూదనరావు, సహాధ్యక్షుడు పోలినాయుడు, మండల కౌన్సిల్ సభ్యులు జాగాన సింహాచలం, వి.తవిటినాయుడు, వి.గిరిప్రసాద్, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – సీతానగరం

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జియ్యమ్మవలస: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ సూచించారు. మండలంలోని అల్లువాడ వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అటు వైపుగా రాకపోకలు సాగించే వాహనదారులను ఆపి, వారి లైసెన్స్‌లతో పాటు వారి వాహన ధ్రువపత్రాలను ఎస్ఐ క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు వెంట తీసుకురావాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి



వడమలో తడిచిన వరి పనలను చూపిస్తున్న బాధిత రైతు

వీరఘట్టం: ఇటీవల కురిసిన వర్షాలకు వరి కుప్పలు తడిచిపోవడంతో ధాన్యం రంగు మారాయని.. ఇటువంటి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. చిదిమి , తదితర గ్రామాల్లో వరి కుప్పలన్నీ తడిచిపోయాయని, ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉండడంతో తడిచిన ధాన్యం పనలను ఆరబెట్టే పనిలో రైతులు బిజీగా ఉన్నారు.

పరిహారం అందించాలి...

పాలకొండ రూరల్: ఖరీఫ్‌లో వర్షాలకు నష్టపోయిన వరి రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వడమ ప్రాంతానికి చెందిన రైతులు ఎం.అప్పన్న, బి.రెయ్యమ్మ, శ్రీనివాసరావు, బి.దుర్గాప్రసాద్, తదితరులు కోరుతున్నారు. కోత సమయంలో వరుస వర్షాల కారణంగా తమ పంట నీట మునిగిందని వాపోయారు. మండల పరిధిలో వెలగవాడ, గరుగుబిల్లి, బాసూరు, రుద్రిపేట, తదితర గ్రామాల్లో కూడా రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయారు. వరితో పాటు అపరాలైన పెసర, మినుము పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తడిచిన వరి పనలను చూపిస్తున్న రైతులు